ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

శుక్రవారం 1 మార్చి 2024

మోదీ మోములో ఓటమి భయం

ఎన్‌డీఏ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం ● కార్యకర్తలకు సీఎం పిలుపు.. బహిరంగ లేఖ ● నేడు జన్మదిన వేడుకలు



చెన్నై, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులపర్యటన నిమిత్తం రాష్ట్రానికి విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీ ముఖంలో లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం కొట్టొచ్చినట్లు కనిపించిందని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఎద్దేవా చేశారు. శుక్రవారం 71వ జన్మదినం జరుపుకోనున్న సందర్భంగా గురువారం పార్టీ శ్రేణులకు ఆయన ఓ లేఖ రాశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుండే తీవ్రంగా శ్రమించి, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ అదేపనిగా రాష్ట్రంలో పర్యటిస్తున్నారని, ఆయన ముఖంలో ఓటమి భయమే అధికంగా కనిపిస్తోందని, ప్రధాని స్థాయికి తగినట్లు సభల్లో ప్రసంగించకుండా సాధారణ కార్యకర్తలా డీఎంకేపై పసలేని విమర్శలు చేసి అభాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోతుందన్న కోపంతోనే మోదీ డీఎంకేపై తిట్ల పురాణం ప్రారంభించారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను డీఎంకే ప్రభుత్వం అడ్డుకుంటోందని చెప్పడం విడ్డూరంగా ఉందని, ఏయే పథకాలకు అడ్డుకట్ట వేశామో మోదీ వివరించగలరా అని స్టాలిన్ ప్రశ్నించారు. మదురైలో ఎయిమ్స్ ఆసుపత్రికి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్న కేంద్రప్రభుత్వం ఆ ఆస్పత్రిని నిర్మించేందుకు ప్రయత్నిస్తే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలను అడ్డుకోవాల్సిన అవసరమే లేదన్నారు. ప్రజలు బాగుపడితే చాలన్నదే తమ అభిమతమన్నారు. నీట్ సహా నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించామని, పౌరసత్వ సవరణ చట్టం వల్ల మైనారిటీలకు రక్షణ లేకపోతుందన్న ఉద్దేశంతో ఆ చట్టాన్ని వ్యతిరేకించామని వివరించారు. ప్రజలకు హాని చేసే కేంద్రప్రభుత్వ ప్రయత్నాలను మాత్రమే డీఎంకే అడ్డుకుంటోందన్నారు. ఎనిమిది జిల్లాలు తుపాను, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయినా కేంద్రం నుంచి చిల్లిగవ్వ రాలేదని, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి బాగులేకపోయినా వరద, తుపాను బాధితులకు ఆర్థిక సాయంతోపాటు పలు రకాల సహాయాలను అందించి కాపాడగలిగిందన్నారు. డీఎంకేను నాశనం చేస్తానంటూ మోదీ తన ప్రధాని పదవి ప్రతిష్ఠను దిగజార్చుకుని సాధారణ కార్యకర్తలా విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. డీఎంకేని అంతమొందిస్తామన్నవారంతా ఎలా పత్తా లేకుండా పోయారో మోదీ తెలుసుకోవాలన్నారు. ప్రధాని మోదీలా తాను రాష్ట్రంలో బీజేపీని నాశనం చేస్తానని ప్రకటించనన్నారు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ఉండాలని, ఆయా పార్టీల సిద్ధాంతాల ప్రకారం ప్రజలకు సేవలు చేయాలని కోరుకుంటామన్నారు. వచ్చేలోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తుడిచిపెట్టుకుని పోవాలని తాను కోరుకోవటం లేదని, ఇండియా కూటమి గెలిచి బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని స్టాలిన్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఇండియా కూటమి నాయకుల మధ్య చిచ్చుపెట్టడమే పనిగా పెట్టుకున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం లభిస్తుందన్నారు. పుదుచ్చేరి సహా 40 చోట్ల గెలిచి ఆ విజయాన్ని మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి సమర్పించడమే డీఎంకే కార్యకర్తల ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.

డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ 71వ జన్మదినవేడుకలను ఘనంగా జరిపేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆయన మెరీనాబీచ్‌లోని మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి సమాధుల వద్ద నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్టీ ప్రముఖులు, కార్యకర్తలు పాల్గొంటారు. ఆ తర్వాత వేప్పేరిలోని పెరియార్ స్మారక స్థలం వద్ద నివాళులర్పిస్తారు. అక్కడి నుండి బయలుదేరి గోపాలపురంలోని కరుణానిధి నివాసానికి వెళ్ళి, తన మాతృమూర్తి దయాళు అమ్మాళ్ ఆశీస్సులందుకుంటారు. అక్కడి నుంచి సీఐటీ కాలనీలోని తన సోదరి, ఎంపీ కనిమొళి నివాసానికి చేరుకుంటారు. కరుణ చిత్రపటం వద్ద కనిమొళి, ఆమె తల్లి రాజాత్తి అమ్మాళ్‌తో కలిసి పుష్పాంజలి ఘటించనున్నారు. ఆ తర్వాత తేనాంపేట చిత్తరంజన్ రోడ్డులోని తన నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులతోపాటు కేక్ కట్ చేస్తారు. ఉదయం పది గంటల నుంచి పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో పార్టీ శ్రేణులను కలుసుకుంటారు.

జన్మదినవేడుకలకు భారీ ఏర్పాట్లు...

వివిధ జిల్లాల నుండి వచ్చే పార్టీ ప్రముఖులు, జిల్లా శాఖ నేతల నుండి పుట్టిన రోజు కానుకలను స్వీకరిస్తారు. అన్నా అరివాలయం వద్ద మంగళవాయిద్యాలతో స్టాలిన్‌కు ఘనస్వాగతం పలికేందుకు పార్టీ నగర ప్రముఖులు సిట్రరసు నాయకత్వంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఎన్నికల బందోబస్తుపై ఈసీ నజర్

● పోలీస్ ఉన్నతాధికారులతో ఎన్నికల అధికారి భేటీ

● నేడు పారామిలిటరీ బలగాల రాక



అధికారులతో మాట్లాడుతున్న సత్యప్రద సాహు

అడయార్, ఫిబ్రవరి 29: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు కోసం 15 కంపెనీల పారామిలిటరీ బలగాలు శుక్రవారం నగరానికి రానున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహు పోలీస్ ఉన్నతాధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలోని సీఈసీ బృందం నగరానికి వచ్చి కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు అఖిలపక్ష నేతలతో సమావేశం నిర్వహించి, ఎన్నికల తేదీలపై అభిప్రాయాలను సేకరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహు గురువారం ఉదయం సచివాలయంలోని ఆడిటోరియంలో పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, క్రైమ్ విభాగం ఏడీజీపీ మహేష్ కుమార్ అగర్వాల్, సాయుధ విభాగం ఏడీజీపీ జయరాం, సీఐఎస్ఎఫ్ ఐజీ శరవణన్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జులుగా మహేష్ కుమార్ అగర్వాల్, జయరాంలను నియమించారు. దీంతో వీరిద్దరు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో ముఖ్యంగా శుక్రవారం నగరానికి రానున్న 15 కంపెనీల పారామిలిటరీ బలగాలను ఏఏ ప్రాంతాలకు తరలించాలి? తదితర అంశాలపై చర్చించారు. అంతేకాకుండా, ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

సీట్ల ఎంపికపై అధిష్ఠానానిదే నిర్ణయం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, ఫిబ్రవరి 29: డీఎంకే కూటమిలో తమ సీట్ల ఎంపికపై ఢిల్లీలోని తమ పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) బీజేపీ కూటమిలో చేరడాన్ని వ్యతిరే



టీఎంసీ నుంచి వైదొలగిన నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై

కిస్తూ ఆ పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి అశోకన్, కాంచీపురం ఉత్తర జిల్లా అధ్యక్షుడు తాంబరం మణి సహా సుమారు 50 మందికి పైగా నిర్వాహకులు గురువారం రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో సెల్వపెరుందగై సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సెల్వపెరుందగై మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల పొత్తులపై బీజేపీ పెద్దలు రోజుకో విధంగా మాట్లాడుతున్నారని, తమిళనాట ఎప్పటికీ కమలం వికసించదన్నారు. వచ్చే వారం ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి వస్తారని, ఆయన నేతృత్వంలో డీఎంకేతో సీట్ల సర్దుబాటు చర్చలుంటాయన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఇంకా సమయం ఉన్నందు వల్ల పొత్తుల ఖరారుపై కాంగ్రెస్ ఆందోళన చెందడం లేదని, తమకు విజయావకాశాలు ఉన్న నియోజకవర్గాలను డీఎంకే తప్పకుండా కేటాయిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సీట్ల ఎంపిక వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని, గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి అదనపు నియోజకవర్గాలను తమకు కేటాయించే అవకాశముందని సెల్వపెరుందగై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కృష్ణస్వామి, తంగబాలు, ఎంపీ డా.విష్ణుప్రసాద్, కార్యదర్శి రూబి మనోహరన్, కౌన్సిలర్ ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.





స్టాలిన్ చేతుల మీదుగా ఒప్పంద పత్రాలను అందుకుంటున్న వామపక్ష నేతలు

వామపక్షాలకు చెరో రెండు సీట్లు

● డీఎంకే కూటమిలో కొలిక్కి వస్తున్న సీట్ల సర్దుబాటు

పెరంబూర్, ఫిబ్రవరి 29: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వస్తోంది. ఆ కూటమిలో సీపీఐ, సీపీఎం పార్టీలకు గత ఎన్నికల తరహాలోనే ఈ సారి కూడా చెరో రెండు స్థానాలు కేటాయించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో పోటీచేయనున్నట్లు ప్రకటించిన సీపీఎం, సీపీఐ నేతలతో డీఎంకే సీట్ల సర్దుబాటు కమిటీ రెండు విడతలుగా చర్చలు జరిపింది. ఈ నేపథ్యంలో, స్థానిక తేనాంపేటలోని అన్నా అరివాలయంలో గురువారం ముఖ్యమంత్రి స్టాలిన్, డీఎంకే సీనియర్ నేతలు టీఆర్ బాలు, దురైమురుగన్ తదితరులతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్ నేతృత్వంలోని ఆయా పార్టీల నేతలు భేటీ అయ్యారు. ఇరు పార్టీల కమిటీలు నిర్ణయించిన మేరకు వామపక్షాలకు చెరో రెండు స్థానాలు కేటాయిస్తూ స్టాలిన్ ఒప్పంద పత్రాలు అందించారు. అయితే ఆ రెండు పార్టీలు ఏఏ సీట్లలో పోటీ చేయాలనే విషయమై తదుపరి చర్చల అనంతరం వెల్లడిస్తామని ఆయా పార్టీల నేతలు తెలిపారు. కాగా, గత పార్లమెంటు ఎన్నికల్లో సీపీఎం కోయంబత్తూర్, మదురైలోను, సీపీఐ తిరుప్పూర్, నాగపట్టణం నియోజకవర్గాల్లో పోటీ చేసి గెలుపొందిన విషయం తెలిసిందే. అదే సమయంలో, ఇప్పటికే డీఎంకే కూటమిలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీకి రామనాథపురం, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి పార్టీకి నామక్కల్ నియోజకవర్గాలు కేటాయించిన విషయం తెలిసిందే.

షరతులకు ఒప్పుకుంటేనే..

● అన్నాడీఎంకేతో పొత్తుకు పీఎంకే మెలిక ?

చెన్నై, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ రెండు పార్టీల మధ్య పొత్తు కుదరాలంటే తమ షరతులకు అంగీకరించాలంటూ పీఎంకే తేల్చిచెప్పింది. వన్నియార్ల ఓటు బ్యాంక్ ఎక్కువగా కలిగిన పీఎంకేని తమ కూటమిలో చేర్చుకోవా




ఈపీఎస్, రాందాస్

లని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అన్నాడీఎంకే మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం రెండుసార్లు దిండివనం తైలాపురం గార్డెన్‌లో పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌తో పొత్తుపై చర్చలు జరిపిన విషయం తెలిసిందే. తమ కూటమిలో చేరితే ఏడు లోక్‌సభ నియోజకవర్గాలను కేటాయించేందుకు అన్నాడీఎంకే అంగీకరించింది. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికల పొత్తు విషయంలో పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, ఆ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ వేర్వేరు అభిప్రాయాలతో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ కూటమి గెలవటం ఖాయమని అన్ని సర్వేలు చెబుతుండటంతో ఆ పార్టీతోనే పొత్తుపెట్టుకుంటే మంచిదని డాక్టర్ అన్బుమణి భావిస్తున్నారు. అయితే పార్టీ వ్యవస్థాపకుడు రాందాస్ బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రస్తుతానికి జాతీయ రాజకీయాలతో పనిలేదని, రాష్ట్ర రాజకీయాలపైనే దృష్టిసారించాలని అన్బుమణికి చెబుతున్నారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో అన్బుమణిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ఒంటరి పోరుకు దిగినా ప్రయోజనం లేకుండాపోయిన విషయాన్ని రాందాస్ గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికలపై దృష్టిసారించి, ఆ దిశగానే లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోవాలని భావిస్తున్నారు. అన్నాడీఎంకే కూటమిలో పీఎంకే చేరితేనే రెండు పార్టీలు లబ్ధి పొందగలవని, కనుక అన్నాడీఎంకే ఇవ్వజూపుతున్న ఏడు లోక్‌సభ స్థానాలే కాకుండా రాజ్యసభ సీటు కూడా కోరాలని రాందాస్ నిర్ణయించారు. అంతటితో ఆగకుండా 2026లో అన్నాడీఎంకే గెలిస్తే డిప్యూటీ సీఎం పదవి పీఎంకేకు ఇవ్వాలని కూడా మెలిక పెట్టినట్లు సమాచారం. శాసనసభలో అన్నాడీఎంకేకు 66 మంది ఎమ్మెల్యేలున్నారని, ఒక రాజ్యసభ సీటుకు 34 మంది శాసనసభ్యుల ఓటు అవసరమని, పీఎంకే శాసనసభ్యులు నలుగురిని కలుపుకుంటే రెండు రాజ్యసభ సీట్లను అన్నాడీఎంకే కైవసం చేసుకునే అవకాశం ఉందని రాందాస్ గుర్తు చేశారు. రెండు రాజ్యసభ స్థానాలు గెలుచుకునే వీలుండటంతో ఒక రాజ్యసభ సీటును పీఎంకేకు కేటాయించాలని రాందాస్ ఈపీఎస్‌పై ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒప్పందానికి అంగీకరిస్తేనే తమతో పొత్తుకు రావాలని ఆయన తెగేసి చెప్పినట్లు తెలిసింది. రాందాస్ డిమాండ్లపై అన్నాడీఎంకే నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. అన్నాడీఎంకే లోక్‌సభ ఎన్నికలకు పెద్దగా ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపించడం లేదు. 2026 శాసనసభ ఎన్నికలపైనే దృష్టిసారిస్తోందని, ఆ ఎన్నికల్లో గెలుపుకోసమే ఇప్పటి నుండే తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాలని ఈపీఎస్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాందాస్ ప్రతిపాదనలను ఈపీఎస్ అంగీకరిస్తారని అన్నాడీఎంకేలోని ఓ వర్గం నాయకులు చెబుతుండగా, మరో వర్గానికి చెందిన నాయకులు పీఎంకేకు డిప్యూటీ సీఎం పదవినిచ్చే ప్రసక్తే లేదని పేర్కొంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ వ్యవహారంపై త్వరలోనే స్పష్టత వస్తుందని ఇరుపార్టీల నేతలు భావిస్తున్నారు.

బీజేపీ శ్రేణుల్లో జోష్ నింపిన ప్రధాని పర్యటన

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్ వెల్లడి



అడయార్, ఫిబ్రవరి 29: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటనతో భారతీయ జనతా పార్టీ శ్రేణుల్లో మంచి ఉత్సాహం వచ్చిందని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. ఆయన గురువారం తిరుచ్చెందూరు మురుగన్ ఆలయంలో సుబ్రమణ్యస్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బుధవారం తూత్తుకుడిలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని రూ.17,500 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారన్నారు. ఒక్క కులశేఖరపట్టణంలోనే రూ.986 కోట్ల విలువైన మినీ రాకెట్ ప్రయోగ కేంద్రానికి శంకుస్థాపన చేశారన్నారు. అదేవిధంగా వీవోసీ హార్బర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, గత పదేళ్ళకాలంలో రూ.11 లక్షల కోట్ల విలువ చేసే ప్రాజెక్టులను ప్రారంభించినట్టు గుర్తు చేశారు. వచ్చే 2047కు భారత్ అభివృద్ధి దేశంగా మారుతుందన్నారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన పెనుమార్పులకు నాంది పలకగా, ముఖ్యంగా పార్టీ శ్రేణుల్లో జోష్ మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ప్రజలపై ప్రధాని మోదీకి అమితమైన ప్రేమాభిమానాలున్నాయని మంత్రి మురుగన్ వెల్లడించారు.

కూటమి పార్టీల చర్చల కోసం కమిటీ

పెరంబూర్, ఫిబ్రవరి 29: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలకు వ్యతిరేకంగా మరో బలమైన కూటమి ఏర్పాటుకు బీజేపీ పావులు కదుపుతోంది. ఇప్పటికే డీఎండీకే, పీఎంకే సహా పలు పార్టీలతో చర్చలు జరిగినా ఆ పార్టీల నుంచి సరైన సమాధానం లభించలేదు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలో మరో బలమైన కూటమి ఏర్పాటుచేసే చర్యలు చేపట్టిన బీజేపీ, పార్టీలతో చర్చించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలో, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అరవింద్ మోహన్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల కో-ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి, శాసనసభ పక్ష నేత నయినార్ నాగేంద్రన్, పొన్.రాధాకృష్ణన్, హెచ్.రాజా, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తదితరులున్నారు.

మహానగర రవాణా సిబ్బంది కోసం మొబైల్ యాప్



కొత్త యాప్‌ను ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి శివశంకర్, అధికారులు

చెన్నై, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మహానగర రవాణా సంస్థ ఉద్యోగులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎస్ఎస్ శివశంకర్ గురువారం ఉదయం ప్రారంభించారు. సచివాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఈ యాప్‌తోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో టికెట్లను రిజర్వు చేసుకునేవారు రూ.40లను అదనంగా చెల్లించి కిలాంబాక్కం బస్‌టెర్మినల్ నుంచి నగరంలో ఇతర ప్రాంతాలకు, అదే విధంగా నగరంలోని పలు ప్రాంతాల నుండి కిలాంబాక్కంకు సిటీ బస్సుల్లో ప్రయాణించే సదుపాయానికి కూడా శ్రీకారం చుట్టారు. ఈ యాప్ ద్వారా రవాణా సంస్థ ద్వారా వచ్చే ఉత్తర్వులు, రవాణా కార్మికులకు అందజేయనున్న సదుపాయాల ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తెలియజేస్తామని మంత్రి శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహానగర రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అల్బీజాన్ వర్గీస్, ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇరా మోహన్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ కే గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నై పెరుంగుడి జోన్ తిరువళ్లువర్‌నగరంలో రహదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఎం. సుబ్రమణ్యం

శ్రీలంకకు శాంతన్ మృతదేహం

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 29: శాంతన్ మృతదేహాన్ని శ్రీలంకకు పంపేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో యావజ్జీవశిక్ష అనుభవిస్తూ కోర్టు ఉత్తర్వులతో విడుదలైన శాంతన్, తిరుచ్చిలోని ప్రత్యేక శిబిరంలో బస చేస్తున్నాడు. ఆయన శ్రీలంక వెళ్లేందుకే కేంద్ర ప్రభుత్వం గత నెల 24వ తేది అనుమతులిచ్చిన నేపథ్యంలో, కాలేయ సంబంధిత సమస్యతో చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శాంతన్ చికిత్స కోసం చేరాడు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం హఠాత్తుగా గుండెపోటుతో ఆయన మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని శ్రీలంకకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయస్థానం, శాంతన్ మృతదేహాన్ని శ్రీలంక పంపించడంలో జాప్యం ఏమిటని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అందుకు ప్రభుత్వ న్యాయవాది బదులిస్తూ.. శాంతన్‌ను గత నెల 27వ తేది ఎయిర్ అంబులెన్స్ ద్వారా శ్రీలంకకు పంపేందుకు చర్యలు చేపట్టామని, కానీ, వైద్యపరంగా తరలింపుకు ఆయన శరీరం సహకరించలేదని తెలిపారు. ప్రస్తుతం, శాంతన్ మృతదేహాన్ని శ్రీలంకకు పంపేందుకు అవసరమైన సహాయాలు, భద్రతా చర్యలు చేపట్టేలా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నియమించి చర్యలు చేపట్టినట్లు రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అదే సమయంలో, శాంతన్ మృతదేహం శ్రీలంకకు తరలించేందుకు అవసరమైన దౌత్యపరమైన అనుమతులు, దస్తావేజులు సత్వరం అందజేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తరపున హైకోర్టులో అఫిడవిట్ దాఖలైంది.

సమాచార దర్శిని

ఆదివారం రేషన్ దుకాణాలకు సెలవు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: రేషన్ దుకాణాలకు ఆదివారం సెలవు ఇచ్చే అంశంపై ప్రభుత్వం పరిశీలిస్తోంది. విధులకు వెళ్లేవారు వస్తువులు కొనుగోలు చేసేందుకు నెలలో మొదటి, రెండవ ఆదివారాలు రేషన్ దుకాణాలు పనిచేస్తున్నాయి. ఆ వారాల్లో శుక్రవారం సెలవు దినంగా ప్రకటించారు. ఆదివారం తక్కువ సంఖ్యలో వస్తువులు పొందేందుకు వినియోగదారులు వస్తున్నారని, ఆరోజు సెలవు ప్రకటించాలని రేషన్ ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై త్వరలో పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నట్లు సహకార శాఖ తెలిపింది.

17 మంది డీఎస్పీల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో 17 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. స్థానిక తిరుమంగళం సహాయ కమిషనర్ వరదరాజన్ ఎంకేబీ నగర్‌కు, ఎంకేబీ నగర్ సహాయ కమిషనర్ పరంధామన్ తిరుమంగళంకు బదిలీ అయ్యారు. కాంచీపురం డీఎస్పీ మణిమేఘలై అదే జిల్లా క్రైం విభాగానికి, కాంచీపురం కొత్త డీఎస్పీగా మురళి నియమితులయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న సహాయ కమిషనర్ పాల్‌స్టీఫెన్ చెన్నై కేంద్ర క్రైం విభాగానికి, కృష్ణగిరి, మదురై, తిరువణ్ణామలై, విరుదునగర్, తంజావూరు ప్రాంతాలకు చెందిన డీఎస్పీలు బదిలీ అయ్యారు.

ఐఏఎస్ అధికారుల బదిలీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర పర్యాటక కమిషనర్, పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కాకర్ల ఉష గృహవసతి, నగర ప్రాంత అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శిగా . గృహవసతి, నగర ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శి సమయమూర్తి పర్యాటక కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈయన పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గాను వ్యవహరిస్తారు. రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక పథకాల అమలు శాఖ కార్యదర్శిగా ధారేష్ అహ్మద్ నియమితులయ్యారు. మళ్లీ ఉత్తర్వులిచ్చేంత వరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ప్రధాన నిర్వహణ అధికారిగా అదనపు బాధ్యతలు వహిస్తారు.

39 మంది సహాయ జియాలజిస్టుల నియామకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: సహాయ జియాలజిస్టులుగా 39 మంది ఎంపిక కాగా, వారికి నియామక ఉత్తర్వులను మంత్రి దురైమురుగన్ అందజేశారు. భౌగోళిక, గనుల శాఖకు టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన రాతపరీక్ష ద్వారా 39 మంది జియాలజిస్టులు ఎంపికయ్యారు. వారికి, కారుణ్య పద్ధతిలో కార్యాలయ అసిస్టెంట్లుగా నలుగురికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు.

53 రైళ్ల స్టాప్‌లు పొడిగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: దక్షిణ రైల్వేలో వివిధ మార్గాల్లో 53 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కేటాయించిన స్టాప్‌లను పొడిగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ క్రమంలో, చెన్నై సెంట్రల్-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇరుమార్గాల్లో వాలాజా రోడ్ స్టేషన్, చెన్నై ఎగ్మూర్-మదురై వైగై ఎక్స్‌ప్రెస్ శ్రీరంగం, చెన్నై ఎగ్మూర్-తిరుచ్చి మలకోట ఎక్స్‌ప్రెస్ లాల్‌గుడి పలంగానత్తం, తాంబరం-నాగర్‌కోయిల్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సాత్తూర్ సహా 53 రైళ్ల మార్గాల్లో ఇదివరకు ఆగి వెళ్లేందుకు కేటాయించిన స్టాప్‌లను కొనసాగించారు.

స్తంభించిన కార్పొరేషన్ వెబ్‌సైట్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: చెన్నై కార్పొరేషన్ వెబ్‌సైట్ స్తంభించడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తాయి. కార్పొరేషన్‌లో ప్రతిరోజు జనన, మరణాలు నమోదుచేసి సర్టిఫికెట్లు ఇస్తుంటారు. ఇవి సంబంధిత ఆస్పత్రుల నుంచి నేరుగా కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. గృహాల్లో జరిగే జనన, మరణాలను ప్రజలే నేరుగా నమోదుచేసుకుంటున్నారు. పత్రాల పరిశీలన అనంతరం సులభంగా డౌన్‌లోడ్ చేసుకొనేలా కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వారం రోజులుగా వెబ్‌సైట్ స్తంభించింది. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

వారం రోజులు పొడి వాతావరణం

పెరంబూర్, ఫిబ్రవరి 29: తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి ఈ నెల 6వ తేది వరకు పొడి వాతావరణం నెలకొంటుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. అదే సమయంలో దక్షిణ, ఉత్తర జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరుగుతాయని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 23-24 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

నేరస్తులను పట్టుకొనేందుకు ఆధునిక పరికరాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: తప్పించుకొని పారిపోయే నేరస్తులను పట్టుకొనేందుకు ఆధునిక పరికరాలను కొనుగోలు చేసేందుకు చెన్నై పోలీసు నిర్ణయించింది. నగరంలో నేరాలు నిరోధించేందుకు పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ చర్యలు చేపట్టారు. పట్టుబడే నేరస్తుల్లో కొందరు తప్పించుకొని పరారవుతున్నారు. కొన్ని సమయాల్లో ఎదురుదాడులకు దిగుతున్నారు. దీన్ని అడ్డుకొనేందుకు వారిని పట్టుకొనేందుకు ఆధునిక పరికరాలు వినియోగించనున్నారు. ఈ పరికరాల్లో ఉచ్చులాంటి తాడు బయటకొచ్చి నేరస్తుడిని మూడు సార్లు చుట్టి బంధిస్తుంది. ఈ పరికరాలను త్వరలో కొనుగోలు చేయనున్నామని అధికారులు తెలిపారు.

కొత్త పరిశ్రమల ఏర్పాటుపై నిఘా కమిటీ

ప్యారీస్, ఫిబ్రవరి 29: ఇటీవల నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడులో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ లు పరిశ్రమలు స్థాపించడాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీలో మంత్రి టీఆర్బీ రాజా సహా 17 మంది సభ్యులున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనా, పరిశ్రమల శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, తమిళనాడు విద్యుత్ బోర్డు చైర్మెన్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శిలతో కూడిన ఈ కమిటీ త్వరలోనే సమావేశమవుతోందని సచివాలయం ప్రకటించింది.

తిరుపోరూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రజినీకాంత్

అడయార్, ఫిబ్రవరి 29: నగర శివారు ప్రాంతమైన నావలూరు గ్రామంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ ఆస్తులు కొనుగోలు చేశారు. వీటి రిజిస్ట్రేషన్ కోసం ఆయన తిరుపోరూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గురువారం ఉదయం 9.45 గంటల సమయంలో వచ్చారు. ఆయనకు చెంగల్పట్టు డీఐజీ రాజ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ అరివళగన్, సబ్ రిజిస్ట్రార్ శక్తి ప్రకాష్ స్వాగతం పలికారు. ఆ తర్వాత రిజిస్ట్రార్ కార్యాలయంలో రజినీ తన ఆస్తులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పనులను పూర్తి చేసుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రజినీకాంత్ వచ్చారన్న విషయం తెలుసుకున్న స్థానికులు, ఆయన అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి, ఆయనతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. అయితే, పోలీసులు, ప్రైవేటు బాడీగార్డుల రక్షణలో ఆయన అక్కడ నుంచి కారులో వెళ్లిపోయారు.




మారథాన్ పోటీలు ప్రారంభిస్తున్న వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం - విజేతలకు బహుమతులు అందజేస్తున్న చాన్సలర్ విశ్వనాథన్, క్రికెటర్ శివందూబె తదితరులు

వీఐటీ వర్సిటీలో 'రివేరా-24' కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 29:: స్థానిక కాట్పాడిలోని వీఐటీ యూనివర్సిటీలో 'రివేరా-24' కల్చరల్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. సంబరాల్లో భాగంగా గురువారం ఉదయం నిర్వహించిన మారథాన్ పోటీలను వర్సిటీ ఉపాధ్యక్షుడు సెల్వం ప్రారంభించగా, సుమారు 3,000 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. విరుదంబుట్ట నుంచి ప్రారంభమైన మారథాన్ వర్సిటీ వరకు కొనసాగింది. 10 గంటలకు జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమానికి వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, ప్రముఖ క్రికెటర్ శివందూబె ముఖ్యఅతిథిగా పాల్గొని మారథాన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా దూబె మాట్లాడుతూ.. చిన్నవయసులోనే చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున ఆడడం తన జీవితంలో మరుపురాని సంఘటన అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకెళ్తే విజయం తనంతట అదే వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్, సెల్వం తదితరులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో 25 దేశాలకు చెందిన 135 విశ్వవిద్యాలయాలు, 100 కళాశాలల నుంచి సుమారు 40,000 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానుండగా, ఈ కల్చరల్ ఫెస్ట్ 55 రకాల పోటీలు నిర్వహించి, సుమారు రూ.20 లక్షల మేర నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బీజేపీతో పొత్తు ప్రసక్తే లేదు

● ప్రతిపక్ష ఉపనేత ఉదయకుమార్

ప్యారీస్, ఫిబ్రవరి 29: దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలను ప్రధాని మోదీ పొగడ్తలతో ముంచెత్తారని, అయినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో కమలం పార్టీతో పొత్తు కుదుర్చుకునే ప్రసక్తే లేదని శాసనసభ ప్రతిపక్ష ఉపనేత, ఎమ్మెల్యే ఆర్బీ ఉదయకుమార్ మరోమారు స్పష్టం చేశారు. ఆయన నగరంలో గురువారం విలేఖరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నారని, ఆయన నాయకత్వాన్ని సుమారు 2 కోట్ల మంది కార్యకర్తలు బలపరుస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు వందలాది మంది ఆశావాహులు దరఖాస్తు చేస్తున్నారని, వాటిని పరిశీలించి అర్హత వారిని అభ్యర్థులుగా అధిష్ఠానం ఎంపిక చేస్తుందన్నారు.

మా గుర్తుపైనే పోటీ : ఎండీఎంకే ప్రకటన

ప్యారీస్, ఫిబ్రవరి 29: లోక్‌సభ ఎన్నికల్లో 'బొంగరం' గుర్తుపైనే పోటీచేయనున్నట్లు ఎండీఎంకే ప్రకటించింది. డీఎంకే కూటమిలో ఉన్న ఎండీఎంకేతో గురువారం సీట్ల సర్దుబాటుపై తేనాంపేటలోని అన్నా అరివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎండీఎంకే తరపున అర్జునరాజు నేతృత్వంలోని కమిటీ పాల్గొంది. ఈ సందర్భంగా అర్జునరాజు మీడియాతో మాట్లాడుతూ... తమ పార్టీకి రెండు లోకసభ స్థానాలు, ఒక రాజ్యసభ స్థానం కేటాయించాలని కోరామని, అయితే దీనిపై డీఎంకే తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. అందువల్ల మళ్లీ చర్చల్లో పాల్గొంటామని, అయితే ఈసారి ఎన్నికల్లో తమ పార్టీ ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీచేయదని, ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదన్నారు. ఇదిలా ఉండగా, ఎండీఎంకే ఎంపీ వైగో తమ పార్టీకి బొంగరం గుర్తు కేటాయించాల్సిందిగా ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులివ్వాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్ శుక్రవారం విచారణకు రానుంది.

వేతనం పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ధర్నా

● మూడు వేల మంది టీచర్ల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 29: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర పది డిమాండ్లతో గత నెల 19వ తేది నుంచి టీచర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చెన్నై సహా పలు జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక నుంగంబాక్కం కాలేజ్ రోడ్డులో ఉన్న డీపీఐ కార్యాలయాన్ని ముట్టడించిన టీచర్లను ఉదయం అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేస్తున్నారు. అదే విధంగా జిల్లా కేంద్రాల్లో టీచర్లు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పరీక్షలకు విద్యార్థులు సిద్ధపడలేని పరిస్థితి నెలకొంది. దక్షిణాది జిల్లాల్లో గురువారం నిరాహారదీక్ష, రాస్తారోకోలో పాల్గొన్న సుమారు మూడు వేల మందికి పైగా టీచర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, గత నెల 19 నుంచి బుధవారం వరకు ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్న టీచర్ల పది రోజుల వేతనంలో కోత విధించడం, 17వ సెక్షన్ కింద క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్లు తెలిసింది.

గుర్తింపు కోల్పోనున్న 11 ఇంజనీరింగ్ కళాశాలలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: అన్నా విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో ఉన్న 11 ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో గుర్తింపు కోల్పోనున్నాయి. 2023-24 విద్యా సంవత్సరం ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు కౌన్సిలింగ్ ముగిసి, కళాశాలల్లో తరగతులు జరుగుతున్నాయి. 440 ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు జరిగాయి. క్రితం సంవత్సరాల్లో ఈ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న నేపథ్యంలో, 2023-24 విద్యా సంవత్సరంలో మరింతగా పడిపోయింది. విద్యార్థుల అడ్మిషన్లు 5 శాతంలోపున్న 11 ఇంజనీరింగ్ కళాశాలల గుర్తింపు 2024-25 విద్యా సంవత్సరంలో పొడిగించే అవకాశం లేదని అన్నా విశ్వవిద్యాలయ వర్గాలు తెలియజేస్తున్నాయి. అలాగే, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కళాశాలలకు జరిమానా విధించేందుకు చర్యలు చేపట్టింది.

గుడియాత్తం పొలాల్లో చిరుతపులి సంచారం

వేలూరు, ఫిబ్రవరి 29: గుడియాత్తం సమీపం మెర్ధానా డ్యాంకు వెళ్లే దారిలోని ఓ పొలంలో గురువారం ఉదయం చిరుతపులి సంచరించింది. ఆ సమయంలో అటువైపు వెళ్తున్న కొందరు చిరుత సంచరించే దృశ్యాలు చిత్రీకరించి అటవీ శాఖ అధికారులకు పంపారు. అధికారులు అక్కడకు చేరుకొనేలోపు చిరుత సమీపంలోని అడవిలోకి వెళ్లింది. ప్రమాదం జరుగకముందే చిరుతను బంధించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతుండగా, రాత్రి వేళల్లో పొలాల్లోకి ఎవరూ వెళ్లరాదని అటవీ శాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు.



సెల్‌ఫోన్‌లో నమోదైన చిరుత సంచారం



శుక్రవారం నుంచి ప్లస్-2 పరీక్షలు ప్రారంభం కానుండటంతో చెన్నైలోని ఓ పాఠశాల తరగతి గదిలో ఫాగింగ్ చేస్తున్న కార్మికుడు

రాష్ట్ర జైళ్లలో బయోమెట్రిక్ విధానం అమలు

ప్యారీస్, ఫిబ్రవరి 29: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో బయోమెట్రిక్ విధానం అమలుపరచినట్లు ప్రభుత్వం తరఫున మద్రాసు హైకోర్టు మదురై బెంచ్‌లో అఫిడవిట్ దాఖలైంది. మదురైకి చెందిన రాజా 2018వ సంవత్సరం హైకోర్టు మదురై బెంచ్‌లో ప్రజావ్యాజ్యం వేశారు. రాష్ట్రంలో జిల్లా కేంద్రాల్లో మాత్రమే కాకుండా తాలూకాల్లో వేలసంఖ్యలో జైళ్లున్నాయని తెలిపారు. కేంద్ర కారాగారాల ప్రాంగణాల్లో ఖైదీలకు చికిత్స అందించే వైద్య సిబ్బంది కోసం క్వార్టర్స్ అందుబాటులో ఉన్నాయని, వీటికి అద్దె కూడా వసూలుచేయడం లేదని అయితే, ఈ క్వార్టర్స్‌లో వైద్యసిబ్బంది ఉండడం లేదని తెలిపారు. అందువల్ల హఠాత్తుగా అనారోగ్యానికి గురవుతున్న ఖైదీలకు వెంటనే చికిత్స అందించలేని పరిస్థితి నెలకొందని, సకాలంలో చికిత్సఅందక ఖైదీలు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ పరికరాన్ని రాష్ట్రప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఏర్పాటుచేసినట్లే జైళ్లలో కూడా ఈ వసతి కల్పించాలని పిటిషనర్ కోరారు. గురువారం ఉదయం ఈ పిటిషన్ విచారణకు రాగా హాజరైన ప్రభుత్వ తరఫు న్యాయవాదులు.. రాష్ట్రంలో ఉన్న అన్ని జైళ్లలో బయోమెట్రిక్ విధానం అమలులో ఉందని వాదించారు. దీనిని అంగీకరించిన న్యాయస్థానం, ఈ కేసుకు ముక్తాయింపు పలుకుతూ ఉత్తర్వులు జారీచేసింది.

రూ.65 లక్షలతో వాననీటి కాల్వలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 29: స్థానిక వలసరవాక్కం మండల పరిధిలోని కారపాక్కంలో రూ.65 లక్షలతో వాననీటి కాలువల నిర్మాణపనులు జరుగుతున్నాయి. గత నవంబరు, డిసెంబరులో కురిసిన భారీవర్షాల కారణంగా ఈ ప్రాంతంలో వరదలు ఏర్పడ్డాయి. ఈసారి వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు వాననీటి కాల్వలు నిర్మించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, అవ్వయార్‌వీధి, పొన్నియమ్మన్ ఆలయ వీధి, సెంగుట్టువన్ వీధి ప్రాంతాల్లో కాలువ నిర్మాణపనులు ప్రారంభించింది.

రైల్వే గేటు మూయడంపై ప్రజల నిరసన

వేలూరు, ఫిబ్రవరి 29: కాట్పాడి-విల్లుపురం వెళ్లే మార్గంలో కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపం వసంతపురం వద్ద రైల్వే గేటు ఉంది. ఈ గేటు మీదుగా వసంతపురం, కస్బా ప్రాంతాలకు చెందిన వేలాది మంది రాకపోకలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ప్రాంతంలో రైల్వే వంతెన నిర్మించనున్నట్లు బుధవారం ప్రకటించిన రైల్వే అధికారులు, నిర్మాణం నిమిత్తం గురువారం నుంచి రైల్వే గేటు మూసివేశారు. దీంతో, ప్రజలు సుమారు 20 కి.మీ దూరం చుట్టుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారుల హఠాత్ నిర్ణయంతో ఆగ్రహం చెందిన ప్రజలు గురువారం రైల్వే గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎంపీ కదిర్ ఆనంద్ ఆ ప్రాంతానికి చేరుకొని ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఎంపీ రైల్వే అధికారులతో మాట్లాడడంతో తాత్కాలికంగా రైల్వే గేటు తెరవడంతో ప్రజలు ఆందోళన విరమించి వెనుదిరిగారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎంపీ కదిర్ ఆనంద్

వ్యాపారవేత్త ఇంటిలో బంగారం చోరీ

అడయార్,ఫిబ్రవరి29:స్థానిక టి.నగర్, సారంగపాణివీధికి చెందిన పంకజ్‌కుమార్ (32) అనే వ్యాపారవేత్త నివాసంలో 90 సవర్ల బంగారం నగలు చోరీకి గురయ్యాయి. దీంతో ఆయన ఇంటిలో పనిచేసే పనిమనిషిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. పోలీసుల కథనం మేరకు, పంకజ్ కుమార్ ఫ్యామిలీ గత వారం రోజుల క్రితం శుభకార్యానికి బంగారు నగలు ధరించిన వెళ్లేందుకు బీరువా తెరిచారు. అందులో ఉంచిన బంగారు నగలు కనిపించకపోవడంతో షాక్‌కు గురై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, ఆ ఇంట్లో పనిచేసే పనిమనిషి విజయలక్ష్మి (22)ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

జెమ్ హాస్పిటల్‌లో మెగా హెర్నియా క్యాంపు

అడయార్, ఫిబ్రవరి 29: నగరంలోని జెమ్ హాస్పిటల్‌లో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మెగా ఫ్రీ హెర్నియా క్యాంపు నిర్వహించనున్నారు. ఇందులో హెర్నియాకు సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించనున్నారు. మార్చి ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఈ క్యాంపు జరుగుతుందని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సి.పళనివేలు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవగాహన శిబిరం పెరుంగుడిలోని ఎంజీఆర్ సాలైలో ఉన్న ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. జెమ్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ నిపుణుడు డాక్టర్ పి. సెందిల్‌నాథన్ సారథ్యంలోని వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొంటుందని తెలిపారు. ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ముున్ముందు కూడా మరిన్ని వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

3 కిలోల గంజాయి స్వాధీనం: ఒకరి అరెస్టు

వెంకటగిరి, ఫిబ్రవరి 29: మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వినయ్ కుమార్ గురువారం మీడియాకు వివరాలు తెలిపారు. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండులో తమిళనాడుకు చెందిన ఖాజా మొహిద్దీన్ షేక్ మన్సూర్ అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా అతడి వద్ద మూడు కిలోల గంజాయి బయటపడింది. దీన్ని రాజమండ్రికి చెందిన సతీష్ అనే వ్యక్తి వద్ద నుంచి కిలో రూ.3వేల వంతున కొనుగోలు చేసి, చెన్నైలో విక్రయించడానికి తీసుకెళుతున్నట్లు గుర్తించారు. దాంతో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సిబ్బంది ఎస్ఐ మహబూబ్ వలి, సిబ్బంది రసూల్, వేణుగోపాల్, పుట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో అధికారులు



ఎన్నికల నోటిఫికేషన్ కూడా రాకముందే ప్రచారం ప్రారంభించిన మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గం నామ్‌తమిళర్ కట్చి అభ్యర్థి కాళియమ్మాళ్

'కనిపిస్తే రమ్మని చెప్పరా' పోస్టర్‌కు బదులిచ్చిన ఎంపీ...!



పోస్టరు ముందు నిలబడిన ఎంపీ వెంకటేశన్

పెరంబూర్, ఫిబ్రవరి 29: 'కనిపిస్తే రమ్మని చెప్పరా' అనే పోస్టర్‌కు 'ఐయామ్ వెయింటింగ్' అంటూ ఎంపీ వెంకటేశ్ బదులిచ్చారు. పలు విషయాల్లో రాష్ట్రం కోసం కేంద్ర ప్రభుత్వానికి నేరుగా గళం విప్పుతున్న పార్లమెంటు సభ్యుడు ఎస్.వెంకటేశ్ అనే పోస్టర్ అంటించిన వారికి 'ఐయామ్ వెయిటింగ్' అంటూ ఎంపీ స్పందించారు. రచయితగా, రాజకీయవేత్తగా ఉన్న ఎస్.వెంకటేశన్, మదురై పార్లమెంటు నియోజకవర్గంలో డీఎంకే కూటమిలో సీపీఎం తరపున పోటీచేసి గెలుపొందిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో జరిగే పలు విషయాలు, సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయడంతో పాటు మదురై నియోజకవర్గ సమస్యలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా ద్వారా ఎంపీ వెంకటేశన్ తెలియజేస్తుంటారు. ఈ నేపథ్యంలో, రెండు రోజుల క్రితం మదురై పార్లమెంటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో 'మా నియోజకవర్గ ఎంపీ కనిపించడం లేదంటూ మదురై నియోజకవర్గ ప్రజలు అనే వ్యాఖ్యలతో పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లు గమనించిన ఎంపీ వెంకటేశన్, వాటి ముందు నిల్చొని ఫోటో తీసి తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎదురుచూస్తున్నానంటూ ఆంగ్లంలో 'ఐయామ్ వెయిటింగ్ అనే వాక్యాన్ని ఎంపీ జతచేశారు. అలాగే, 'చేతబట్టుకొని తీసుకురండి' అనే హ్యాష్‌టాగ్‌ను కూడా ఆయన పోస్ట్ చేశారు.

ఉద్యోగ బదిలీని శిక్షగా భావించొద్దు

● హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, ఫిబ్రవరి 29: ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ బదిలీని శిక్షగా భావించరాదని మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ పేర్కొంది. మదురైకి చెందిన జోసఫ్ దాఖలుచేసిన పిటిషన్‌లో... ప్రభుత్వ రవాణా సంస్థ మదురై జోన్‌లో తాను 25 ఏళ్లుగా డ్రైవర్‌గా పనిచేశానని, తనను శివగంగ జిల్లా త్రిభువనం ప్రభుత్వ రవాణా సంస్థకు బదిలీ చేశారని, తన సర్వీసులో ఇప్పటివరకు ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని, తనపై ఒక్క ఫిర్యాదు కూడా లేదని అయితే, సీనియర్ ఉద్యోగి అయిన తనను కారణం లేకుండా బదిలీ చేశారని, అందువల్ల ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన న్యాయస్థానం, ఇరుతరపు వాదనల అనంతరం..ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ బదిలీని శిక్షగా భావించరాదని, ఇది కూడా సేవలో ఒక భాగమేనని అనుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులందరికీ కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఉద్యోగం చేసే ప్రాంతంలో కనీస వసతులు లేని పక్షంలో సంబంధిత అధికారుల వద్ద విజ్ఞప్తి చేసుకోవచ్చని ఆదేశించింది.

ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్య

ప్యారీస్, ఫిబ్రవరి 29: స్థానిక వానగరంలో ప్లస్ టూ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వానగరం శక్తినగర్‌కు చెందిన రతిదేవి కుమార్తె కవిన్య అదే ప్రాంతంలో ఉన్న ఓ పాఠశాలలో చదువుతోంది. అనారోగ్యం బారిన పడగా, పలువురి వైద్యుల వద్ద చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మరణించే ముందు ఆమె రాసిన లేఖలో... తన మరణానికి ఎవరూ కారణం కాదని, మనస్తాపంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాసి ఉందని మధురవాయల్ పోలీసులు తెలిపారు.

డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు

● జాఫర్ సాధిక్ ఇంటికి సీలు

ప్యారీస్, ఫిబ్రవరి 29: డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా నాయకుడిగా వ్యవహరించి ప్రస్తుతం అజ్ఞాతంలోకి జారుకున్న సినీ నిర్మాత జాఫర్ సాధిక్ ఇంటికి కేంద్ర మత్తుపదార్థాల నివారణ కేంద్రం అధికారులు సీలు వేశారు. రామనాథపురం జిల్లా కముది ప్రాంతానికి చెందిన జాఫర్ సాధిక్ (36) సినీనిర్మాతగా వ్యవహరిస్తూ డీఎంకేలో చెన్నై పశ్చిమ జిల్లా ఓబీసీ విభాగం డిప్యూటీ ఆర్గనైజర్ పదవిలో కూడా కొనసాగారు. ఆయన మైలాపూర్‌లో ఇంట్లో కుటుంబంతో కలసి నివసిస్తూ, డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు వ్యవహారంలో అజ్ఞాతంలోకి జారుకున్నారు. ఆయన సోదరులు మహమ్మద్ సలీమ్, మైదీన్‌లతో కలసి అమీర్ దర్శకత్వంలో 'ఇరైవన్ మిగయపెరియవన్' అనే చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర మత్తుపదార్థాల తరలింపు నివారణ విభాగం అధికారులు జాఫర్ సాధిక్‌కు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో తనిఖీలు పూర్తిచేసి, ఆయన కోసం గాలిస్తున్నారు. అంతేకాకుండా, ఆయనతో సన్నిహిత సంబంధాలున్న వ్యక్తుల వివరాలు కూడా సేకరిస్తున్నారు. మైలాపూర్‌లో ఉన్న సాధిక్ ఇంటికి బుధవారం సీలు వేసి సమన్లకు సంబంధించిన నోటీసు కూడా అంటించారు.

మాజీ పాత్రికేయుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవం



మృతిచెందిన పాత్రికేయుడికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు, సభ్యులు

వేలూరు, ఫిబ్రవరి 29: తమిళనాడు మాజీ పాత్రికేయుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవం గురువారం జరిగింది. కాట్పాడిలో జరిగిన వేడుకలకు సంఘ ఉపాధ్యక్షుడు దొరై కరుణ అధ్యక్షత వహించగా, ఉప కార్యదర్శి ఆహ్వానించారు. సంఘ అధ్యక్షుడు సుబ్రమణి వేడుకలు ప్రారంభించగా, సెక్రటరీ పళనియప్పపిళ్లై వార్షిక నివేదిక చదివి వినిపించారు. ట్రెజరర్ జ్ఞానకుమార్ నిధుల రిపోర్టు సమర్పించారు. కార్యక్రమంలో సంఘ స్థాపకుడు స్టాలిన్, సభ్యులు దొరై పద్మనాభన్, చక్రవర్తి, సింధనైసెల్వన్, న్యాయవాది లెనిన్‌బాబు, 50 మందికి పైగా మాజీ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ముందుగా ఇటీవల మృతిచెందిన తిరువణ్ణామలై ఆరణికి చెందిన మాజీ పాత్రికేయుడు మోహన్ చిత్రపటానికి నిర్వాహకులు నివాళులర్పించారు.

కనీస వసతులు లేవంటూ ఎన్నికల బహిష్కరణ


● కరూరులో నల్లజెండాల ప్రదర్శన

చెన్నై, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కరూరు జిల్లా కుళిత్తలై సమీపంలోని విశ్వనాథపురం, కప్పన్ ఆచ్చారికుళం తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న యాభైకి పైగా కుటుంబీకులు తమ ప్రాంతంలో సరైన రహదారులు తదితర కనీస సదుపాయాలు కల్పించలేదని ఆరోపిస్తూ లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. అంతే కాకుండా తమ ఇళ్ల వద్ద నల్లజెండాలు ఎగురవేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు ఆ కుటుంబీకులతో చర్చలు జరిపేందుకు తరలి వెళ్లారు.



విశ్వనాథపురంలోని ఓ ఇంటి వద్ద ఎగురుతున్న నల్లజెండా

సీబీఎఫ్ సంఘంలో విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న డా.జడ వసంతబాబు

ప్యారీస్,ఫిబ్రవరి29:స్థానిక ఆర్కే. నగర్ నియోజకవర్గం కొరుక్కు‌పేట కామరాజనగర్‌లోని సీబీఎఫ్ సంఘ ఆవరణలో శుక్రవారం నుంచి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. విశ్వ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జడ బ్లెస్సీశరాఫ్ నిర్వహణలో గురువారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. సీబీఎఫ్ వ్యవస్థాపకులు డా.జడ వసంతబాబు విద్యార్థులకు పెన్నులు అందజేసి ఆశీర్వదించారు.

మొదటి అంతస్తు నుంచి దూకేసిన ప్రేమజంట


అడయార్, ఫిబ్రవరి 29: లాడ్జిలో ఉండగా బంధువులు గదిని చుట్టుముట్టారన్న తెలుసుకున్న ప్రేమికులు వారి నుంచి తప్పించుకునేందుకు లాడ్జి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేశారు. ఈ ఘటన ఈరోడ్ జిల్లా సత్యమంగళంలో జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన రాహుల్ ప్రభాకర్ అనే వివాహితుడు సత్యమంగళం ప్రాంతానికి చెందిన యువతితో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సత్యమంగళం బస్టాండు సమీపంలో ఉన్న ఒక లాడ్జి గది అద్దెకు తీసుకుని అక్కడ సన్నిహితంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న వారివారి కుటుంబ సభ్యులు లాడ్జి వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమజంట లాడ్జి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకేశారు. దీంతో రాహుల్‌కు కాలు విరగ్గా, వనితకు వెన్నుపూస దెబ్బతింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, వారిద్దరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బిర్యానీలో చికెన్ లేదని హత్య.... ఐదేళ్ళ తర్వాత నిందితుడి అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 29: స్థానిక కోయంబేడు మార్కెట్‌లో ఐదేళ్ళ క్రితం జరిగిన హత్య జరిగిన కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. బిర్యానీలో చికెన్ ముక్క లేదన్న అక్కసుతో ఆ మహిళను హత్య చేసినట్టు నిందితుడు వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు.. కోయంబేడు మార్కెట్‌లో 2019లో 30 యేళ్ళ మహిళ దారుణ హత్యకు గురైంది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఐదేళ్ళుగా విచారణ సాగుతున్నప్పటికీ నిందితుడిని గుర్తించలేకపోయారు. తాజాగా చెయ్యారు జిల్లాకు చెందిన గుణ (44) దిన కూలీ ఈ మహిళను హత్య చేసినట్టు గుర్తించారు. భార్యకు దూరంగా ఉండే గుణ.. కోయంబేడు మార్కెట్‌లో ఉండేవాడు. ఈ క్రమంలో మార్కెట్‌లో ఉండే దేవి అనే మహిళతో పరిచయమై ఇద్దరూ కలిసి ఉండేవారు. ఒక రోజున వీరిద్దరూ మద్యం సేవించి, బిర్యానీ తెచ్చుకోగా, గుణ ప్యాకెట్‌లో చికెన్ ముక్క లేకపోవడంతో ఆగ్రహించి, ఆమెపై దాడి చేయడంతో ఆమె మృతి చెందినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో ఇన్‌స్పెక్టర్ భరణీధరన్ సారథ్యంలోని ప్రత్యేక బృందం నిందితుడు గుణ కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఆధ్యాత్మికం


ఇష్టదేవేరులతో కుమారస్వామి


మయూరాచలంపై కుమారస్వామి ఆలయం


కుమారస్వామికి విభూది అలంకారం


రాజగోపురం

విల్లుపురం జిల్లాలో దిండివనం నగరానికి పది కిలోమీటర్ల దూరంలో కి.మీ దూరంలో నలువైపులా పచ్చదనంతో చిట్టడవులతో కూడిన మయూర పర్వతంపై తన ఇష్టదేవేరులతో కొలువై ఉన్నారు కుమారస్వామి. భీకర సంగ్రామంలో తాను సంహరించిన శూరపద్మునే నెమలివాహనంగా చేసుకుని, అతడికి ముక్తిని ప్రసాదించడమే కాకుండా ఆ అసురుడు తపమాచరించిన నెమలి ఆకారం కలిగిన పర్వతంపై వళ్లీ, దేవసేన సమేతంగా కొలువై భక్తులకు సకల సౌభాగ్యాలను ప్రసాదించి అనుగ్రహిస్తున్న సుప్రసిద్ధ క్షేత్రం మయిలం మురుగన్ ఆలయం.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


ఆలయంలో ఉత్సవ మూర్తులు

కోరిన వరాలిచ్చే కొండంత దేవుడు

మయిలమ్ కుమారస్వామి

● శూరపద్ముడు తపమాచరించిన ప్రదేశం ● దేవేరులతో కొలువైన మురుగన్

స్థలపురాణం...

కుమారస్వామితో యుద్ధం చేసిన శూరపద్ముడు తాను చేసిన తప్పులకు పశ్చాత్తాపం చెంది ముక్తిని ప్రసాదించమని, తనను మయూరవాహనంగా స్వీకరించమని స్వామివారిని వేడుకున్నాడు. భోళాశంకరుడి తనయుడు కనుక కుమారస్వామి అతడి కోరిక నెరవేరేందుకు ఓ తరుణోపాయం చెబుతారు. వరాహనది ఉత్తర దిశలో ఉన్న అడవిలో నెమలి పర్వతంగా మారి తపస్సు చేయమని సలహా ఇస్తారు. ఆ విధంగా శూరపద్ముడు నెమలి కొండగా మారి తపమాచరిస్తాడు. ఆ తపస్సును మెచ్చి స్వామివారు శూరపద్ముడిని మయూర వాహనంగా చేసుకుని ముక్తిని ప్రసాదిస్తారు. ఆ సందర్భంగా తన కొండపై ఇష్టదేవేరులతో కొలువుదీరమంటూ కుమారస్వామిని వేడుకోగాస్వామివారు అప్పటి నుండి ఈ కొండపైనే వళ్ళి, దేవసేన సమేతుడై భక్తులను అనుగ్రహిస్తున్నారు. నెమలి ఆకారంలో ఉన్న ఇక్కడి పర్వతాన్ని 'మయూరాచలం' అని, 'మయిలమ్' అని పిలుస్తున్నారు.

మరో పురాణగాథ....

కైలాసంలో శివగణ నాయకులలో ఒకడైన శంఖునాథుడిని పరమేశ్వరుడు పిలిచి శైవవ్యాప్తి కోసం, శైవ సిద్ధపురుషుల కోసం భూలోకంలో దక్షిణభారతావనిలో జన్మించమంటూ ఆదేశిస్తారు. ఆ శివాజ్ఞ ప్రకారం శివగణ నాయకుడు మయిలమ్ పర్వతానికి తూర్పుదిశగా సముద్రతీరంలో బాల సిద్ధుడిగా అవతరిస్తారు. తరువాత మయిలమ్ పర్వతానికి వెళ్ళి కుమారస్వామి అనుగ్రహం కోసం ఘోరతపమాచరిస్తారు. ఆ తపస్సును మెచ్చిన వళ్ళి, దేవసేన ఆ సిద్ధపురుషుడి ఎదుట ప్రత్యక్షమై అనుగ్రహించమని తమ పతిదేవుడైన కుమారస్వామిని వేడుకుంటారు. అయితే ఆ సిద్ధపురుషుడి తపస్సు పరిపక్వం కాలేదని, అతడిని అనుగ్రహించేందుకు మరికొంత కాలం పడుతుందని కుమారస్వామి తనదేవేరులకు నచ్చ చెబుతారు. తమ మాటను పట్టించుకోని కుమారస్వామిపై ఇష్టదేవేరులు కినుక వహించి మయిలమ్ పర్వతం వద్దనున్న బాలసిద్ధుడి ఆశ్రమానికి చేరుకుంటారు. తన ఇష్టదేవేరులు అదృశ్యం కావటంతో దిగులు చెందిన స్వామివారు వారి జాడ కోసం అంతటా వెదికారు. చివరకు వేటగాడి వేషంలో మయిలమ్ పర్వతానికి వెళతాడు. తన ఆశ్రమ ప్రాంతంలో సంచరిస్తున్న వేటగాడు కుమారస్వామి అని తెలియక బాలసిద్ధుడు యుద్ధానికి సిద్ధమవుతాడు. భీకర సంగ్రామం తర్వాత స్వామివారు నిజరూపంతో బాలసిద్ధుడి ఎదుట ప్రత్యక్షమవుతారు. స్వామివారిని చూసి బాలసిద్ధుడు పారవశ్యం చెందుతాడు. ఇష్టదేవేరులతో ఆ పర్వతంపైనే భక్తులకు దర్శనమివ్వాలని వేడుకుంటాడు. స్వామివారు అంగీకరించి ఆ నాటి నుండి వళ్ళిదేవసేన సమేతుడైన భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆ బాలసిద్ధుడే కాలగమనంలో శివజ్ఞాన బాలయ దేశికర్‌గా కీర్తిగడించారు. ఆయనే ఈ పర్వత ప్రాంతంలో బొమ్మపురం మఠాన్ని కూడా నెలకొల్పారు. ప్రస్తుతం ఆ సిద్ధపురుషుడి వంశీయులే ఈ మఠాధిపతిగా వ్యవహరిస్తున్నారు.


మహామండపం

ఆలయ వైభవం...

నెమలి ఆకారంలో చుట్టూ పచ్చదనంతో కూడిన మయిలం క్షేత్రం భక్తులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. పర్వతం దిగువన ఆగ్నేయంగా అగ్నితీర్థం అనే తీర్థకొలను ఉంది. దాని సమీపంలోనే వినాయకుడి ఆలయం ఉంది. అక్కడే భక్తులు తలనీలాలను సమర్పిస్తారు. చిన్నారులకు కర్ణాభరణాలను కూడా నిర్వహిస్తుంటారు. పర్వతంపైకి వెళ్లేందుకు మెట్లున్నాయి. మెట్లదారిలో భక్తులు సేద తీరటానికి అక్కడక్కడా మంటపాలు కూడా ఉన్నాయి. ఈ పర్వతాన్ని ఎక్కలేనివారు. వాహనాల్లో వెళ్లేందుకు ఘాట్ రోడ్డు కూడా ఉంది. పర్వతంపైకి వెళ్ళగానే తూర్పుదిశగా అందమైన రాజగోపురం దర్శనమిస్తుంది. ఈ రాజగోపుర ప్రవేశద్వారం మార్గళి మాసం తిరువాదిరై, ఆరుద్రదర్శన దినాన, ఆణి తిరుమంజనం వేడుకల సందర్భంలో మాత్రమే తెరుస్తారు. తక్కిన రోజుల్లో రాజగోపుర ప్రవేశద్వారం మూసి ఉంటుంది. భక్తులు దక్షిణ దిశలో ఉన్న ద్వారం గుండా వెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకుంటారు. ఈ రాజగోపురానికి ఎదురుగానే శ్రీమఠం ఉంది. దక్షిణ ప్రవేశద్వారం గుండా లోపలకు వెళితే వినాయకుడి సన్నిధి, పక్కనే శ్రీలశ్రీ బాలసిద్ధుడు ఐక్యమైన శివలింగం సన్నిధి దర్శనమిస్తాయి. ఆ తర్వాత బాలసిద్ధుడికి, శూరపద్ముడికి దర్శనమిచ్చి అనుగ్రహించిన స్వామివారు వళ్ళిదేవసేన సమేతుడై కల్యాణపురుషుడిగా కనిపిస్తారు. ఈ ఆలయంలోని మయూరం ఉత్తరాభిముఖంగా ఉంటుంది. దక్షిణదిశవైపు ఉండే నెమలిని 'దేవమయూరం' అని ఉత్తర దిశగా నిలిచి ఉండే నెమలిని 'అసుర మయూరం' అని పిలుస్తారు. అసురుడైన శూరపద్ముడు నెమలి ఆకారాన్ని ధరించటం వల్ల ఈ ఆలయంలోని మయూరం ఉత్తరాభిముఖంగా ఉంటుంది. గర్భాలయం విమానంలో కుమారస్వామి 16 నామదేయాలను తెలిపేలా 16 విధాలైన కోణాల్లో స్వామివారు దర్శనమిస్తున్నారు. నడుమ సిద్ధ పురుషుల విగ్రహాలు కూడా ఉన్నాయి. కల్యాణమండపం పైకప్పులో అన్ని రాశులను తెలిపే శిల్పాలున్నాయి. స్వామివారికి ఎడమవైపు ఉన్న మండపంలో ఉత్సవమూర్తులు దర్శనమిస్తారు. వీటిలో ఓ ఉత్సవమూర్తి పుదుచ్చేరిలో నిర్వహించే మాసిముఖం ఉత్సవాలకు తీసుకెళతారు. మరొక ఉత్సవమూర్తి పర్వతంపై నిర్వహించే ఉత్సవాలలో సర్వాలంకరణతో ఊరేగుతారు. ప్రతిరోజూ ఉదయం ఆరుగంటలకు బాలసిద్ధుడి సన్నిధిలో పూజలు నిర్వహించిన మీదటే అన్ని సన్నిధులలో పూజలు ప్రారంభమవుతాయి.


మెట్ల మార్గంలో మండపాలు

ఆలయవిశేషాలు...

ఈ ఆలయంలో తైపూస పర్వదినంలో 1008 శంఖాలతో అభిషేకం, పంగుణి నెలలో రథోత్సవం జరుగుతాయి. ఆణి మాసంలో ఆరుద్రదర్శనం సందర్భంగా బాలసిద్ధుడి మహా గురుపూజ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఆలయంలోని కుమారస్వామివారిని దర్శించుకుంటే వివాహయోగం, సంతానభాగ్యం, సకలైశ్వరాలు ప్రాప్తిస్తాయని పండితులు చెబుతున్నారు. ఆలయంలోని కుమారస్వామి సైన్యాధ్యక్షుడు వీరబాహుడిని ప్రతి మంగళవారం దర్శించుకుంటే కార్యసిద్ధి ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ ఆలయాన్ని ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8.30 గంటలకు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. శుక్ర, ఆదివారాలు, కృత్తిక దినాలలో ఉదయం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు నిర్విరామ దర్శనం కల్పిస్తారు. ఈ ఆలయంలో మరో ప్రత్యేక ఆకర్షణ స్వర్ణమయూర వాహనం. తైపూసవేడుకల్లో పంగుణి మాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలలో ఐదో రోజు కుమారస్వామి ఈ స్వర్ణవాహనంపై ఆలయ వీదులలో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు.

ఎలా వెళ్ళాలి?

ఈ ఆలయం చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిలో చెన్నైకి దక్షిణ దిశగా 122 కి.మీల దూరంలో దిండివనం నగరానికి ఆగ్నేయ దిశగా సుమారు 10 కి.మీ.ల దూరంలో మయిలమ్ క్షేత్రం ఉంది. దిండివనం నుంచి మయిలం మీదుగా పుదుచ్చేరికి వెళ్లే సాధారణ సర్వీసు రవాణా సంస్థ బస్సులన్నీ ఆలయం సమీపంలో ఆగి వెళుతుంటాయి.ఈ ఆలయానికి దిండివనం నుండి ఆటోలు, టాక్సీలు, షేర్ ఆటోలు కూడా నడుపుతున్నారు.


వీరబాహుడి సన్నిధి

చిత్రజ్యోతి



తమిళం నేర్చుకుంటా

● కన్నడ నటి ప్రియాంక

తన మాతృభాష కన్నడం అయినప్పటికీ.. తమిళంలో అనర్గళంగా మాట్లాడాలన్నదే తన కల అని శాండల్‌వుడ్ హీరోయిన్ ప్రియాంక దిమ్మేష్ అన్నారు. కన్నడంలో పలు చిత్రాల్లో నటించిన ఆమె.. శ్రీకాంత్ హీరోగా నటించిన 'సత్తమింద్రి ముత్తం తా' చిత్రం ద్వారా కోలీవుడ్ కు పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'కొన్నేళ్ళ విరామం తర్వాత మళ్ళీ కోలీవుడ్ లోకి అడుగుపెడుతున్నా. ఈ సినిమాలో నాకు అవకాశం అనుకోకుండా లభించింది. నా మేనేజరు, హీరో శ్రీకాంత్ మేనేజర్లు స్నేహితులు కావడంతో ఈ అవకాశం వచ్చింది. ఇందుకోసం నేను శ్రీకాంత్‌కు థ్యాంక్స్ చెబుతున్నాను. ఈ స్టోరీ దర్శకుడు వివరించే సమయంలోనే నాకు బాగా నచ్చింది. అందుకే సినిమా బాగా వచ్చేందుకు వీలుగా నా వంతు కృషి చేస్తానని చెప్పాను. దర్శకుడు చెప్పినట్లుగా నడుచుకున్నాను. నేను తమిళం నేర్చుకుంటున్నాను. తమిళ భాష బాగా నేర్చుకుని సినీ అవకాశాలు పొందాలన్నదే నా కోరిక. ఇప్పటివరకు నేను చేసిన చిత్రాల్లోకెల్లా ఈ సినిమా నా కెరీర్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది' అని ప్రియాంక పేర్కొన్నారు.

రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదు

● హీరో ప్రశాంత్



ఇప్పట్లో తనకు రాజకీయాల్లోకి రావాలన్న ఉద్దేశ్యం ఏమాత్రం లేదని హీరో ప్రశాంత్ స్పష్టం చేశారు. అయితే నటుడిగా ప్రజలకు ఏం చెయ్యగలనో అది చేస్తానని వ్యాఖ్యానించారు. గత కొన్ని రోజులుగా తిరునెల్వేలి, తూత్తుక్కుడి జిల్లాల్లో ఆయన పర్యటిస్తూ అభిమానులను కలుసుకుంటున్నారు. అదే సమంలో ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ చేసేటపుడు విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరుతూ, అవగాహన కల్పించేలా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'హెల్మెట్‌ను శిరస్త్రాణాం అని చెబుతారు. ఈ హెల్మెట్ మన ప్రాణాలను రక్షించే కవచం మాత్రమే కాకుండా, కుటుంబానికి రక్షణ కవచంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాల్లో చనిపోయే వారిలో అనేక మంది హెల్మెట్లు ధరించకపోవడంతో ప్రాణనష్టం జరుగుతుంది. అందుకే శిరస్త్రాణాంపై ప్రజల్లో అవగాహన కల్పించేలా తన వంతు ప్రచారం చేస్తున్నాను. ఇపుడు విజయ్ 'గోట్' మూవీలో నటిస్తున్నాను. పెద్ద హీరోలతో కలిసి నటించడం కొత్తకాదు. 'కల్లూరి వాసల్' సినిమా నుంచి ఇది కొనసాగుతుంది. విజయ్ రాజకీయాల్లోకి రావడం, పార్టీని ప్రారంభించడం మంచి విషయం. కానీ, నేను మాత్రం ఇప్పట్లో రాజకీయాల్లోకి రాను. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన 'అంధగన్' చిత్రం త్వరలోనే విడుదలకానుంది. 'జీన్స్' మూవీ సీక్వెల్ గురించి ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. దీనికి నా వద్ద సమాధానం లేదు. దర్శకుడు శంకర్ బదులివ్వాలి' అని పేర్కొన్నారు.

ఉత్తరాది కార్మికుల ఇతివృత్తంతో 'వడక్కన్'

ప్రముఖ సినీ రచయిత భాస్కర్ శక్తి మెగా ఫోన్ పట్టారు. ఆయన తొలిసారి దర్శకత్వం వహిస్తున్న చిత్రం పేరు 'వడక్కన్'. రాష్ట్రంలో నివసించే ఉత్తరాది కార్మికుల ఇతివృత్తంతో ఈ సినిమా రూపొందిస్తున్నారు. డిస్కవరీ సినిమాస్ బ్యానరుపై నిర్మాత ఎం.వేదియప్పన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. అందరూ కొత్తవారు నటించే ఈ సినిమాలో కుంకుమ రాజ్, వైరిమాల హీరోహీరోయిన్లు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉత్తరాది కార్మికులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, తదితర విషయాలను నేపథ్యంగా చేసుకుని ఈ సినిమాను హాస్యభరితంగా రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పనులు ఇప్పటికే పూర్తి చేసుకోగా, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి, త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు శీను రామస్వామి గురువారం తన 'ఎక్స్' ఖాతాలో రిలీజ్ చేశారు. తేని ఈశ్వర్ కెమెరామెన్‌గా పనిచేసే ఈ సినిమాకు ఎస్‌జే జనని సంగీతం.



జీవీ ప్రకాష్ కుమార్ సరసన శివానీ రాజశేఖర్

ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. ఇప్పటికే పలు చిత్రాల్లో కథానాయకుడిగా నటిస్తున్న జీవీ.. తాజాగా మరో చిత్రంలో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో జీవీ సరసన సీనియర్ నటీనటులైన డాక్టర్ రాజశేఖర్ - జీవిత దంపతుల కుమార్తె శివాని హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ చెన్నైలో గురువారం ప్రారంభమైంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ సినిమాలో పశుపతి, లింగేష్, విశ్వనాథ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు పా.రంజిత్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే మోసస్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమవుతుంటే, పా.రంజిత్ తన సొంత నిర్మాణ సంస్థ నీలం ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించనున్నారు. సంగీతం జీవీ ప్రకాష్ కుమార్. అలాగే, పా.రంజిత్ కూడా చియాన్ విక్రమ్ హీరోగా 'తంగలాన్' సినిమా రూపొందిస్తున్న విషయం తెల్సిందే.


జీవీ, పా.రంజిత్, శివానీ తదితరులు

టాటా సన్స్ చైర్మన్‌కు బిజినెస్ లీడర్‌షిప్ అవార్డు



అడయార్, ఫిబ్రవరి 29: టాటా సన్స్ లిమిటెడ్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌కు ది ఎంఎంఏ-అమల్గమేషన్స్ బిజినెస్ లీడర్‌షిప్-2023 అవార్డు ప్రదానం చేశారు. బుధవారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో అమల్గమేషన్ గ్రూపు చైర్మన్ ఏ.కృష్ణమూర్తి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టఫే చైర్మన్ మల్లికా శ్రీనివాసన్, ఏషియన్ పెయింట్స్ చైర్మన్ ఆర్.శేషసాయి, కార్పొరేట్ అడ్వైజర్ ఎస్.గురుమూర్తి, మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది అర్వింద్ దటర్ తదితరులు పాల్గొన్నారు. ఎంఎంకే ప్రెసిడెంట్ కె.మహాలింగం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెప్టెన్ ఆర్.విజయ్‌కుమార్ (రిటైర్డ్) అతిథులకు స్వాగతం పలికారు.

రిటైరైన పోలీసులకు వీడ్కోలు


పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులతో కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

చెన్నై, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనరేట్‌లో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన ఇద్దరు పోలీసు అధికారులు సహా 30 మంది పోలీసులను కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఘనంగా సత్కరించారు. నగర పోలీసు శాఖలో సెంట్రల్ క్రైం విభాగం అడిషనల్ డిప్యూటీ కమిషనర్ సి.జయసింగ్, చిన్నారులపై లైంగిక వేధింపులు, మహిళలపై నేరాల నిరోధక విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎం.అశోక్‌కుమార్, ట్రాపిక్ సీఐలు జి. మురుగేశన్, బి. వెంకటేశన్, పది మది ఎస్ఐలు, 13 మంది స్పెషల్ ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్ సహా మొత్తం 30 మంది గురువారం పదవీ విరమణ చేశారు. ఆ సందర్భంగా పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటైన వీడ్కోలు సభలో పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ పదవీ విరమణ చేసిన పోలీసుల సేవలను అభినందిస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వీడ్కోలు సభలో సెంట్రల్ క్రైంవిభాగం అడిషనల్ కమిషనర్ పీకే సెంథిల్‌కుమారి, ప్రధాన కార్యాలయం డిప్యూటీ పోలీసు కమిషనర్ ఎ. కయల్ విళి, డిప్యూటీ కమిషనర్లు వీఆర్ శీనివాసన్, ఎ. మణివన్నన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.37 కోట్లతో కన్నియాకుమారిలో అద్దాల వంతెన

ప్యారీస్, ఫిబ్రవరి 29: కన్నియాకుమారి సముద్రంలో తిరువళ్లువర్ విగ్రహం-స్వామి వివేకానంద రాక్‌లను కలుపుతూ రూ.37 కోట్లతో అద్దాల వంతెన నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కన్నియాకుమారిని సందర్శించే స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా ఏడాదికి కోటి మంది పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి పనులు చేపట్టింది. ఇందులో భాగంగా వివేకానంద స్మారక మండపానికి, భారీ తిరువళ్లువర్ విగ్రహ సందర్శనకు పర్యాటకులు వెళ్లేందుకు పడవలు నడుపుతోంది. అయితే పడవలు పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతంలో లోతు అధికంగా ఉండడం వల్ల అద్దాల వంతెన నిర్మాణం చేపట్టింది. మరో రెండు నెలల వ్యవధిలో పనులు పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

చెంగల్పట్టులో టూరిస్ట్ బంగ్లా ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 29: చెంగల్పట్టులో రూ.6.79 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించిన టూరిస్ట్ బంగ్లాను రాష్ట్ర మంత్రులు ఏవీ వేలు, టీఎం అన్బరసన్ గురువారం ప్రారంభించారు. అసెంబ్లీలో ప్రజాపనులు, రహదారులు, చిన్న ఓడరేవుల శాఖ మంత్రి ప్రకటించిన మేరకు చెంగల్పట్టు, రాణిపేట, కళ్లకుర్చి, తిరుపత్తూర్, తెన్‌కాశి, మైలాడుదురై అనే ఆరు కొత్త జిల్లాల్లో తలా రూ.7.5 కోట్ల వ్యయంతో నూతనంగా టూరిస్ట్ బంగ్లాలు రూ.42.30 కోట్లతో నిర్మిస్తున్నారు. వీటిలో పనులు పూర్తయిన కారణంగా చెంగల్పట్టు టూరిస్ట్ బంగ్లాను జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు ప్రారంభించారు.